నగరాన్ని ముంచెత్తిన ఫెంగల్

- జలదిగ్బంధంతో స్తంభించిన జనజీవనం ● నిలిచిపోయిన రోడ్డు రవాణా
- సబర్బన్ రైళ్లూ బంద్ ● విమానాశ్రయం మూసివేత
- భారీ వర్షంతో తీరప్రాంత జిల్లాలు అతలాకుతలం ● అర్ధరాత్రి పుదువై సమీపంలో తీరం దాటిన తుఫాన్



చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను నగరాన్ని ముంచెత్తింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో చెన్నై నగరం జలదిగ్బంధంలో చిక్కుకుంది. శనివారం అంతా వర్షం కురుస్తూనే వుండడంతో వాణిజ్య కేంద్రాలుండే టీనగర్, పురుషవాక్కం, ప్యారీస్ వంటి ప్రాంతాలు సైతం నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. పెనుగాలుల కారణంగా శివారు ప్రాంతాల్లో కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పట్టాభిరాం మెయిన్‌రోడ్డు, తెండ్రల్ నగర్, ఆవడి వసంతం నగర్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ క్వార్టర్స్ ప్రాంతం, సరస్వతి నగర్, ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాలు నీటిలో మునిగాయి. మనలి ఎక్స్‌ప్రెస్ రోడ్డులో వర్షపునీరు వరదలా ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కార్గిల్ నగర్, రాజాజీ నగర్, సత్యమూర్తినగర్ తదితర ప్రాంతాల్లోని రెసిడెన్షియల్ క్వార్టర్స్ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో పుదుచ్చేరి వద్ద తీరాన్ని తాకిన తుఫాన్ అర్ధరాత్రి దాటిన తరువాత తీరం దాటింది.



టి.నగర్ సబ్‌వేలో నిలిచిన నీరు

8 సబ్‌వేల మూత...

నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా 8 సబ్‌వేలను మూసివేసినట్లు కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు. నగరమంతటా 21 సబ్‌వేలు ఉన్నాయి. కొంగురెడ్డి, రంగరాజపురం -వీలర్, పళవంతాంగళ్, ఆర్‌బీఐ సబ్‌వే, పెరంబూరు అజాక్స్ తదితర 8 సబ్‌వేలలో వర్షపునీరు అధికంగా ప్రవహిస్తుండటంతో మూసివేశారు. ఇదే విధంగా తాంబరం రైల్వే సబ్‌వేలో వర్షపునీరు ప్రవహించడంతో అది కూడా మూసి వేశారు.

విమానాశ్రయ రన్‌వే పైకి నీరు

చెన్నై జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల్లో రన్‌వేలపైకి వరదనీరు చేరింది. దీంతో విమానాల రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. అంతే కాకుండా శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం ఉదయం వరకు విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. తుఫాను కారణంగా చెన్నై నుంచి మదురై, తూత్తుకుడి తదితర ప్రాంతాలకు వెళ్లే 55 విమాన సర్వీసులను రద్దు చేశారు. చెన్నై నుంచి బయలుదేరేవి, ఇతర ప్రాంతాల నుండి వచ్చే విమాన సర్వీసులను సమీపంలోని విమానాశ్రయాలకు మళ్లించారు.

రాయపురంలో..

రాయపురం మాదా చర్చి ప్రాంతంలో ఇళ్లలోకి వరదనీరు జొరబడింది. దీంతో ఆ ఇళ్లలో నివసిస్తున్నవారంతా రాత్రంతా కంటిమీద కునుకులేకుండా గడిపారు. వాషర్‌మెన్‌పేట, భోజరాజ నగర్, రాయపురం, ఆట్టుదొడ్డి, మింట్ స్ట్రీట్, వాల్‌టాక్స్ రోడ్డు తదితర రహదారుల్లోనూ అడుగు లోతు పైగా వర్షపునీరు ప్రవహించింది. కొడుంగయూరు తెండ్రల్ నగర్ ఒకటి నుంచి ఐదు వరకు వీధుల్లో రెండడుగుల మేర వర్షపునీరు ప్రవహిస్తోంది. పూందమల్లి రోడ్డు రిథర్డన్ రోడ్డులో వాహనాలు వెళ్లలేనంతగా వరదనీరు ప్రవహిస్తోంది. కోయంబేడు మెట్రో వంతెన మీదుగా మార్కెట్‌కు వెళ్లే రహదారిలోనూ వరద దృశ్యాలే కొనసాగుతున్నాయి. అయ్యప్పన్ తాంగళ్ నుండి కాట్టుపాక్కం వరకు ప్రధాన రహదారి పూర్తిగా వర్షపునీటిలో మునిగింది. చేపాక్ వాలాజారోడ్డులో రెండడగులు లోతున వరదనీరు పొంగి ప్రవహించింది.

నీట మునిగిన వేళచ్చేరి...

స్థానిక వేళచ్చేరిలో పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పలు కాలనీల్లో నివసిస్తున్నవారంతా ఇంటి నుంచి కదల్లేని పరిస్థితి నెలకొంది. తరమణి, పెరుంగుడి, కందన్‌చావిడి ప్రాంతాల్లోనూ వరద నీరు ప్రవహిస్తోంది. కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు భారీ మోటార్ల ద్వారా నీటిని తొలగిస్తున్నా పరిస్థితి అధ్వాన్నంగానే వుంది.

203 ప్రాంతాలపై నిఘా..

నగరంలో తీవ్ర వరద పరిస్థితులు ఏర్పడే 203 ప్రాంతాలపై అగ్నిమాపక సిబ్బంది నిఘా వేస్తున్నారు. నగరంలోని 42 అగ్నిమాపక కేంద్రాల్లో వరదబాధితులకు సహాయక చర్యలు చేపట్టేందుకు 1300 మంది సిబ్బందిని సిద్ధం చేశారు. వరదబాధిత ప్రాంతాల్లో ఇళ్ల వద్ద జలదిగ్బంధంలో చిక్కుకునేవారిని కాపాడేందుకు రబ్బరు బోట్లు, మరపడవలు తదితర సామగ్రితో వర్షబాధిత ప్రాంతాలకు వెళుతున్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో 15 జోన్‌లలో 9 హైడ్రాలిక్ రంపాలు, 216 టెలస్కోపిక్ రంపాలతో రెండు కమెండో దళాలు రంగంలోకి దిగాయి. భవన, కట్టడ శిథిలాలలో చిక్కుకునేవారిని కనుగొనే పరికరాలు, రోప్ లాన్సర్, రోప్ రైడర్, థెర్మల్ ఇమేజింగ్ కెమెరాలను కూడా సిద్ధం చేసి ఉంచారు.



సహాయక చర్యలపై అధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి చర్చలు

రైలు పట్టాలపైకి వరదనీరు

తుఫాను ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి కురిసిన కుండపోత వర్షాలకు పల్లావరంలోని రైలు పట్టాలపైకి వరద నీరు చేరింది. దీంతో ఆ మార్గంలో లోకల్ విద్యుత్ రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బీచ్ నుంచి తాంబరం వైపు వెళ్లే రైళ్లన్నీ పల్లావరం వరకే నడిపారు. సుమారు రెండు గంటలకు పైగా ఆ మార్గంలో లోకల్ రైళ్లు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఇక సుదూర ప్రాంతాల నుంచి చెన్నై రావాల్సిన కొన్ని రైళ్లను ఆవడి నుంచే వెనక్కి మళ్లించారు.

మూతబడిన విద్యాలయాలు

చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, మైలాడుదురై, రాణిపేట, కడలూరు, విల్లుపురం, కళ్ళకురిచ్చి, మైలాడుదురై జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలకు శనివారం సెలవు ప్రకటించారు. అదే విధంగా పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని పాఠశాలలు, కళాశాలలకు కూడా శనివారం సెలవు ప్రకటించారు.



పల్లావరం రైల్వేస్టేషన్‌లో పట్టాలపైకి చేరిన వరదనీరు

సినిమా ప్రదర్శనల రద్దు

ఫెంగల్ తుఫాను కారణంగా శనివారం చెన్నైలోని థియేటర్లలో సినిమా ప్రదర్శనలు రద్దు చేశారు. నగరంలో భారీ వర్షం కారణంగా వరద పరిస్థితులు నెలకొనటంతో శనివారం ఉదయం నుంచే సినిమా ప్రదర్శన నిలిపివేశారు. ఇదిలా ఉండగా భారీ వర్షాల వల్ల నగరంలోని నగల దుకాణాలనుకూడా మూసివేశారు.

నేడు ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్

- 9 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

ఫెంగల్ తుఫాను ప్రభావంతో ఆదివారం ఆరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం, విల్లుపురం, కళ్ళకురిచ్చి, కడలూరు జిల్లాలకు ఆదివారం రెడ్ అలర్ట్ జారీ చేశారు. చెన్నై, రాణిపేట, తిరువణ్ణామలై, వేలూరు, పెరంబలూరు, అరియలూరు, తంజావూరు, తిరువారూరు, మైలాడుదురై, నాగపట్టినం జిల్లాల్లోనూ ఆదివారం భారీ వర్షం కురిసే అవకాశముంది. దీంతో ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రాణనష్టం జరగరాదు

- అధికారులకు సీఎం దిశానిర్దేశం ● తుఫాన్ పరిస్థితులపై సమీక్ష
- అమ్మా క్యాంటీన్లలో ఉచిత ఆహారం ● ఇంటి నుంచి బయటకు రావద్దు ● ప్రజలకు స్టాలిన్ వినతి

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా ప్రాణనష్టం జరగడానికి వీల్లేదని, ఆ మేరకు తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం ఉదయం మెరీనాబీచ్ ఎళిలగం భవనంలో రెవెన్యూ విపత్తుల నిర్వహణా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన కంట్రోల్ రూంలో అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించిన సీఎం.. ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. కాంచీపురం, తిరువళ్లూరు, రాణిపేట, చెంగల్పట్టు, విల్లుపురం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చెన్నై సహా సముద్రతీర జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయని, ఆ జిల్లాల్లో వరదబాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు అందించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫెంగల్ తుఫాను ప్రభావిత వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయకచర్యలు చేపడుతున్నామని వివరించారు. గత రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికల మేరకు అధికారులతో ఆయా ప్రాంతాల్లో పరిస్థితులపై సమీక్షించానన్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వరకు నగరంలోనూ, పరిసర జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయని చెప్పారు. శనివారం రాత్రి తుఫాను తీరం దాటే సమయంలో కుండపోత వర్షాలు కురుస్తున్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చామన్నారు. వర్షబాధిత జిల్లాల్లో ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులే కాకుండా ఇతర మంత్రులు కూడా సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలని పురమాయించినట్లు చెప్పారు. నగరంలో ఏయే ప్రాంతాల్లో వరద పరిస్థితులు ఏర్పడతాయో అంచనా వేసి, ముందుగా మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు వాననీటిని తొలగిస్తున్నట్లు చెప్పారు. టి.నగర్ ప్రాంతంలో గతంలా వర్షపునీరు రహదారులపై ప్రవహించడం లేదని, అధికారులు ఆ ప్రాంతంలో మోటారు పంపులద్వారా వాననీటిని తొలగిస్తున్నారని చెప్పారు. ఫెంగల్ తుఫాను సృష్టించనున్న పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్టాలిన్ తెలిపారు.



ఎళిలగంలోని కంట్రోల్ రూంలో వర్షాలపై సమీక్షిస్తున్న సీఎం స్టాలిన్

5 శిబిరాల్లో సహాయక చర్యలు...

భారీ వర్షాల కారణంగా చెంగల్పట్టు, తిరువళ్లూరు, విల్లుపురం జిల్లాల్లో వర్షబాధితుల కోసం ఐదు ప్రత్యేక సహాయక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. వర్షబాధితులను, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని ఆ శిబిరాలకు తరలించి ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమ్మా క్యాంటీన్లలో ఆహారం...

నగరంలో భారీ వర్షాలు కురవటంతో పేదలను ఆదుకునేలా శనివారం నగరంలోని అమ్మా క్యాంటీన్లలో మూడు పూటలా ఉచితంగా ఆహారం అందించాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ నుండే తాను చెంగల్పట్టు, తిరుక్కళికుండ్రం ముత్తమిళ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సహాయ శిబిరంలో ఉంటున్న బాధితులతో ఫోన్‌లో మాట్లాడి వారికి లభిస్తున్న సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నానని వివరించారు. అదే విధంగా వర్ష ప్రభావిత ప్రాంతాల్లో సహాయ క్రమాలు సక్రమంగా జరుగుతున్నాయా, లేదా అని ప్రత్యేక నిఘా వేసినట్టుట సీఎం తెలిపారు.



బోసిపోయిన నిత్యం రద్దీగా ఉండే పుదుచ్చేరిలోని కోటకుప్పం రోడ్డు

18 ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు...

వర్షబాధిత ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 18 ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దింపినట్లు స్టాలిన్ తెలిపారు. ఆ మేరకు చెన్నై, చెంగల్పట్టు కార్పొరేషన్‌లకు తలా మూడు బృందాలు, కడలూరు, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదుర్రై, విల్లుపురం జిల్లాలకు తలా 2 బృందాలను పంపినట్లు వివరించారు.

ఇళ్ల నుంచి బయటకు రావద్దు...

భారీ వర్షాల కారణంగా ఆయా జిల్లాల ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇల్లు విడిచి బయటకు రావద్దని సీఎం సూచించారు. ప్రజల ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదని, అందువల్ల పరిస్థితి గ్రహించి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదిలా వుండగా ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కేఎన్ నెహ్రూ, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, రెవెన్యూ కమిషనర్ రాజేష్ లఖానీ, రెవెన్యూ విపత్తుల నిర్వహణ విభాగం ముఖ్య కార్యదర్శి పి. అముద, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.కుమార గురుబరన్ తదితరులున్నారు.





బ్రాడ్వే సమీపంలో హైకోర్టు చుట్టుపక్కల రోడ్లపై వరద నీరు - జలమయమైన ఎంకేబీ నగర్ రోడ్డు

వర్ష బాధితుల కోసం పడవలు సిద్ధం

అత్యవసర ఫోన్ నెంబర్లు

వర్షాలపై ఫిర్యాదుకు : 1070
జిల్లా స్థాయిలో ఫిర్యాదుకు : 1077
వాట్సప్ నెంబర్ : 9445869848
చెన్నై కార్పొరేషన్ : 1913
విద్యుత్ అవసరాలకు : 9498794987
తాగునీటి కోసం : 044-4567
పాములు పట్టేందుకు : 044-2220 0335
చెన్నై మెట్రోరైలు : 1860425151
బ్లూక్రాస్ : 9677297978, 9841588852
మహిళల అత్యవసర స్థితికి : 181
చైల్డ్‌లైన్ : 1098

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై సహా తొమ్మిది జిల్లాల్లో తుఫాన్ ప్రభావిత భారీ వర్షాల కారణంగా జలదిగ్బంధంలో చిక్కుకునేవారిని సకాలం లో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రాష్ట్ర విపత్తుల స్పందన దళం (ఎస్డీఆర్‌ఎఫ్) సభ్యులు రంగంలోకి దిగుతున్నారు. కూలిన చెట్లను తొలగించడం, జలదిగ్బంధంలో చిక్కుకున్నవారికి అన్నపానీయాలు అందించటం, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి సహాయక చర్యలు చేపట్టేందుకు తగు సరంజామాతో వెళ్లారు. పల్లపు ప్రాంతా ల్లో వరదనీటిలో చిక్కుకున్న నివాసాల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకుగాను 800 పడవలను కూడా తీసుకెళ్ళారు. ప్రస్తుతం నగరంలో వరద పరిస్థితులు ఏర్పడేందుకు అవకాశమున్న ప్రాం తాల్లో ఈ పడవలను, లైఫ్‌జాకెట్లను ఉపయోగించనున్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలోని నటేశన్‌పార్కు, జీవా పార్కు, మేడే పార్కు సహా మొత్తం 871 ఉద్యానవనాలను మూసివేశారు.



తాంబరం సమీపంలో పడవల్లో బాధితులను తరలిస్తున్న దృశ్యం

12 పోలీసు సహాయ బృందాలు...

గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో వర్షబాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు 12 పోలీసు సహాయ బృందాలు ఏర్పాటయ్యాయి. పోలీసు కమిషనర్ అరుణ్ ఉత్తర్వు మేరకు అదనపు పోలీసు కమిషనర్లు, డిప్యూటీ పోలీసు కమిషనర్లు, సహాయ కమిషనర్ల పర్యవేక్షణలో ఆ బృందాలు వరద బాధిత ప్రాంతాల్లో గస్తీ వాహనాలల్లో పర్యటించనున్నాయి. ఈ బృందం సభ్యులు రబ్బరు బోట్లు, లైఫ్‌జాకెట్లు, రోప్, చెట్ల కొమ్మలను కోసే రంపాలు తదితర సామగ్రితో నగరమంతా సంచరించి బాధితులకు సకాలంలో సహాయక చర్యలు చేపట్టనున్నారు. ఈ బృందాల సహాయం కావాల్సినవారు 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసు కమిషనర్ అరుణ్ ఓ ప్రకటనలో తెలిపారు.



పట్టణంబాక్కం తీరంలో ఎగసిపడుతున్న అలలు



మద్యం కోసం మందుబాబుల ఆరాటం

వర్షాలకు జనజీవనం స్తంభించిపోతున్నా మందుబాబులు మాత్రం టాస్మాక్ దుకాణాల ముందు బారులుదీరుతున్నారు. పులియాతోంపు హైరోడ్డులో వరద నీటిలోనే మద్యం కోసం నిలబడ్డారు.

జలదిగ్బంధంలో కరుణానిధి ఇల్లు



గోపాలపురంలో కరుణానిధి ఇంటి చుట్టూ చేరిన వర్షపునీరు

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా నగరంలో కురిసిన భారీ వర్షాలకు గోపాలపురంలోని మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నివాసం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ప్రస్తుతం ఆ ఇంటి చుట్టూ అడుగుమేర వర్షపునీరు ప్రవహిస్తోంది. అక్టోబరు 15న భారీ వర్షాలు కురిసినప్పుడు కూఆ కరుణానిధి ఇంటిలోకి నీరు ప్రవేశించకుండా ఇసుక బస్తాలను పేర్చారు. ప్రస్తుతం ఆ ఇంటి వద్ద ఇసుక బస్తాలు వేయకపోవడంతో ఇంటిలోకి వర్షపునీరు ప్రవేశించింది.

సమాచార దర్శిని

'కంప్యూటర్ తమిళ్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమిళ భాషాభివృద్ధికి కృషిచేస్తున్న వారిని ప్రోత్సహించేలా తమిళ అభివృద్ధి శాఖ పలు పురస్కారాలు అందజేస్తోంది. ఆ క్రమంలో, తమిళ భాష అభివృద్ధికి సాఫ్ట్‌వేర్, యాప్ రూపొందించే వారికి 'ముఖ్యమంత్రి కంప్యూటర్ తమిళ్ అవార్డు' అందజేస్తోంది. ఈ ఏడాది పురస్కారానికి వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చు. 2021 తర్వాత రూపొందించిన సాఫ్ట్‌వేర్, యాప్ తదితర వివరాలతో www.tamilvalarchithurai.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి 'తమిళ అభివృద్ధి డైరెక్టర్, తమిళ అభివృద్ధి డైరెక్టరేట్, తమిళ్ శాలై, ఎగ్మూర్, చెన్నై-08' అనే చిరునామాకు ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తులు పంపించాలని అధికారులు తెలిపారు.

ఆదిద్రావిడ సంక్షేమ కమిటీకి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో ఆదిద్రావిడ సంక్షేమ కమిటీలో పదవులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో.. జిల్లా ఆదిద్రావిడ సంక్షేమ కమిటీ ఏర్పాటు చేయనున్నామని, ఆ కమిటీలో సభ్యులుగా చేరేందుకు ఆదిద్రావిడులు, గిరిజనుల అభివృద్ధికి కృషిచేసే సమాజసేవకులు, విద్యావేత్తలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి ఉన్న వారు తమ వివరాలతో దరఖాస్తులను జిల్లా ఆదిద్రావిడ, గిరిజనుల సంక్షేమ శాఖ కార్యాలయంలో డిసెంబరు 25వ తేదిలోగా నేరుగా గాని, పోస్టు ద్వారా పంపాలని కలెక్టర్ తెలిపారు.

5 వరకు 'సీఎం ఫార్మశీ' దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాలో బి.ఫార్మ్, డి.ఫార్మ్ చేసిన వారు 'సీఎం ఫార్మశీ' పేరుతో మెడికల్ షాపుల ఏర్పాటుకు నవంబరు 30వ తేది వరకు దరఖాస్తు చేయాలని ప్రకటించారు. దరఖాస్తు గడువు శనివారం ముగిసిన నేపథ్యంలో, అభ్యర్థుల కోరిక మేరకు డిసెంబరు 5వ తేది వరకు గడువు పొడిగించినట్లు కాంచీపురం మండల సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.

తాంబరం నుంచి ఎగ్మూర్-మదురై ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో పనుల కారణంగా ఎగ్మూర్-మదురై-ఎగ్మూర్ మధ్య నడుపుతున్న రైళ్ల ను తాత్కాలికంగా మార్చినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, మదురై-ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5వ తేది నుంచి ఎగ్మూర్ బదులు తాంబరం వరకు మాత్రమే నడపనున్నారు. అలాగే, ఎగ్మూర్-మదురై ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6 నుంచి ఎగ్మూర్‌కు బదులు తాంబరం నుంచి బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

వారణాసి, అయోధ్యకు ప్రత్యేక రైలు

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళా సందర్భంగా తిరునల్వేలి నుంచి చెన్నై ఎగ్మూర్ మీదుగా వారణాసి, అయోధ్యకు ఆధ్యాత్మిక రైలు నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ తెలిపింది. మహా కుంభమేళా వచ్చే ఏడాది జనవరి 13వ తేది ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్రం నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, వారణాసి, అయోధ్యకు భక్తులు వెళ్లవచ్చు. జనవరి 16వ తేది తిరునల్వేలి నుంచి ఈ రైలు మదురై, తిరుచ్చి, తంజావూరు, చిదంబరం, చెంగల్పట్టు, తాంబరం, చెన్నై ఎగ్మూర్ మార్గం గుండా వెళ్లనుంది. 9 రోజుల ఈ పర్యటనకు నాన్ ఏసీలో ప్రయాణించేందుకు ఒకరికి రూ.28,100, థర్డ్ ఏసీలో ఒకరికి రూ.44,850 ఛార్జీగా నిర్ణయించారు. వివరాలకు 9003140739, 8287931977 నెంబర్లను సంప్రదించవచ్చని ఐఆర్‌సీటీసీ తెలిపింది.

రైల్వే హెల్ప్ నెంబర్లు

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సబర్బన్ రైళ్ళ వివరాలను తెలుసుకునేందుకు దక్షిణ రైల్వే హెల్ప్ నెంబర్లను ప్రకటించింది. కామన్ కంట్రోల్ రూమ్‌కు 044-2533 0952, 044-2533 0953, సెంట్రల్ రైల్వే స్టేషన్ 044-2535 4140, ఎగ్మోర్ స్టేషన్‌లో 900 3161811, తాంబరం స్టేషన్‌లో 86104 59668, చెంగల్పట్టు స్టేషన్‌లో 9345962113, పెరంబూరు స్టేషన్‌లో 9345962147 అనే నెంబర్లలో సంప్రదించవచ్చు.

నైపుణ్యాభివృద్ధి పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఉన్నత విద్యపై ఆసక్తి పెంపొందించేలా 10వ తరగతి చదువుతున్న 500 మంది విద్యార్థులు, 500 మంది విద్యార్థినులకు ప్రతినెలా రూ.1000 చొప్పున ఒక విద్యా సంవత్సరంలో రూ.10,000 విద్యాసహాయాలు అందజేస్తున్నారు. అర్హులైన విద్యార్థులను నైపుణ్యాభివృద్ధి పరీక్ష ద్వారా ఎంపిక చేయనుండగా, జనవరి 25వ తేది ఆన్‌లైన్‌లో పరీక్ష జరుగనుంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు డిసెంబరు 9వ తేది వరకు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ నుండి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించాలి.

నిండుకుండలా చెంబరంబాక్కం



అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగర వాసుల దాహార్తిని తీర్చే చెరువుల్లో ఒకటైన చెంబరంబాక్కం చెరువు నిండు కుండలా మారింది. చెన్నైతో పాటు నగర శివారు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ చెరువుకు భారీగా వర్షపునీరు చేరింది. దీంతో ఈ చెరువు పూర్తిగా నిండిపోయింది. అలాగే, పూండి రిజర్వాయర్‌లో మొత్తం నీటి నిల్వ 35 అడుగులకుగాను ప్రస్తుతం 22.84 అడుగులుండగా, రెడ్‌హిల్స్ చెరువులో 17.10 (21.20) అడుగులు, చోళవరం చెరువులో 2.75 (18.86) అడుగులు, కన్నన్‌కోట్టై తేర్వాయి కండ్రిగ చెరువులో 30.34 (36.61) అడుగుల మేర నీరుంది. అన్ని చెరువుల్లో నీటి నిల్వ కెపాసిటీ 11.76 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.78 టీఎంసీల నీరుందని జలవనరుల మంత్రిత్వ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విభాగం శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

రూ.4 వేల లంచం.. ఏఈ, లైన్‌మేన్ అరెస్ట్

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ కోసం లంచం తీసుకున్న ఇద్దరు విద్యుత్ శాఖ అధికారులు కటకటాలపాలయ్యారు. కాంచీపురం సమీపం మాంతంగల్ గ్రామానికి చెందిన ప్రభాకర్, కొత్త ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. విద్యుత్ కనెక్షన్ కోసం గత నెల 26వ తేది ఆన్‌లైన్‌లో రూ.1,550 చెల్లించాడు. కనెక్షన్ ఇవ్వాలంటే రూ.4,000 లంచం ఇవ్వాలని సహాయ ఇంజనీర్ అశోక్‌రాజ్ కోరాడు. దీంతో ప్రభాకర్, ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనలతో రసాయనాలు పూసిన రూ.4 వేల కరెన్సీ ప్రభాకరన్ శుక్రవారం సహాయ ఇంజనీర్ అశోక్‌రాజ్‌కు ఇవ్వబోగా, అక్కడే ఉన్న వైర్‌మెన్ శాంతమూర్తి చేతికి ఇవ్వాలని సూచించాడు. దీంతో, ప్రభాకరన్ నగదును శాంతమూర్తికి అందిస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు అతడిని, అశోక్‌రాజ్‌ను పట్టుకుని అరెస్ట్ చేశారు.

విద్యుదాఘాతానికి వలస కార్మికుడి మృతి

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్యారీస్ కార్నర్‌లోని ఒక ఏటీఎం సెంటరులో నగదు విత్ డ్రా తీసుకునేందుకు వెళ్ళిన ఉత్తరాది కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. విద్యుత్ షాక్ తగలడంతో మరణించాడు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి సమీపం విడుకపాళయంలో ఉన్న రైల్వే గేట్ మూయరాదని డిమాండ్ చేస్తూ గురువారం పొల్లాచ్చి అన్నాడీఎంకే ఎమ్మెల్యే పొల్లాచ్చి జయరామన్ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో అన్నాడీఎంకే నగర కార్యదర్శి కృష్ణకుమార్ సహా కార్యకర్తలు, ప్రజలు రైలుపట్టాలపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో, పోతనూరు రైల్వే పోలీసులు, నిషేధిత ప్రాంతంలో ప్రజలను సమీకరించి ఆందోళన చేపట్టారంటూ ఎమ్మెల్యే సహా పలువురిపై కేసు నమోదుచేశారు.

వివాహం చేసుకుని కళాశాలకు వస్తున్న ప్లస్ వన్ ప్రేమ జంట

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు తెలియకుండా రహస్య వివాహం చేసుకొని, మళ్లీ కళాశాలకు వస్తున్న ప్లస్ వన్ ప్రేమ జంట వ్యవహారం కలకలం రేపింది. తూత్తుకుడి జిల్లాలోని ఓ పాఠశాలలో 17 ఏళ్ల విద్యార్థి, 16 ఏళ్ల విద్యార్థిని ప్లస్ వన్ చదువుతున్నారు. వేర్వేరు కులాలకు చెందిన వీరు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. గత మే నెలలో స్నేహితుల సమక్షంలో వీరు రహస్యంగా వివాహం చేసుకున్నారు. అనంతరం యధావిధిగా ఇద్దరూ వారి వారి ఇళ్ల నుంచి కళాశాలకు వస్తున్నారు. కుమార్తె తీరు అనుమానించిన తల్లిదండ్రులు ఆమెను నిలదీయగా, జరిగిన విషయం తెలుసుకొని నిర్ఘాంతపోయారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన సాతాన్‌కుళం మహిళా పోలీసులు, ఆ యువకుడిని అరెస్ట్ చేసి, బాలికను ప్రభుత్వ హోంకు తరలించి, విచారిస్తున్నారు.

తమ్ముడి మృతి తట్టుకోలేక సోదరి ఆత్మహత్య

వేళచ్చేరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ్ముడి మృతి తట్టుకోలేక కళాశాల భవనంపై నుండి దూకి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదం నింపింది. రామనాథపురం జిల్లా ముదుకుళత్తూర్‌కు చెందిన కావ్యదర్శిని, తిరుచెంగోడు సమీపం ఎలయంపాళయంలోని ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. ఈ నేపథ్యంలో ఆమె ఉంటున్న విడిది సమీపంలో కావ్యదర్శిని మృతిచెంది పడివున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసుల విచారణ చేపట్టగా... కావ్యదర్శిని సోదరుడు గత ఏడాది మృతి చెందగా, అప్పటి నుంచి ఆమె మానసికంగా ఇబ్బంది పడుతోందని, ఘటన జరిగిన రోజున కళాశాల భవనంలోని మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

బాణసంచా పేలి ఒకరి మృతి

వేళచ్చేరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శివకాశిలో బాణసంచా పేలి ఒకరు మృతి చెందారు. వివరాలిలా వున్నాయి... వేలాయుధ రస్తా రోడ్డులో మురుగేశన్‌కు చెందన లారీ ట్రాన్స్‌పోర్ట్ ఉంది. ఇక్కడి నుంచి లారీల్లో పొరుగు రాష్ట్రాలకు బాణసంచా తరలిస్తుంటారు. శుక్రవారం ఉదయం కేరళ రాష్ట్రానికి బాణసంచా తీసుకెళ్లేందుకు, కార్మికులు టపాసుల బండిళ్లను లారీలో ఎక్కిస్తున్నారు. ఆ సమయంలో బాణాసంచా పేలడంతో శివకాశి నెహ్రూ కాలనీకి చెందిన లోడ్‌మెన్ పాల్‌స్వామి (55) మంటల్లో చిక్కుకొని సజీవదహనమయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భర్త ద్వారా లంచం తీసుకున్న సర్వేయర్ అరెస్ట్

వేళచ్చేరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుమంగళంలో భర్త ద్వారా రూ.5 వేలు లంచం తీసుకొన్న సర్వేయర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థలం సర్వే చేసి పట్టా ఇవ్వాలని కోరుతూ కీళ వీరప్పనూరు గ్రామానికి చెందిన అజిత్‌కుమార్ దరఖాస్తు చేసుకున్నాడు. సర్వే చేపట్టాలంటే లంచం ఇవ్వాలని తెలిపిన మహిళా సర్వేయర్ చిత్రాదేవి, నగదును వేరే ప్రాంతంలో ఉన్న తన భర్తకు అందించాలని తెలిపింది. అజిత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో నిఘా వేసిన పోలీసులు, సర్వేయర్ చిత్రదేవి సహా నగదు తీసుకుంటున్న ఆమె భర్త గణపతివేల్‌ను అరెస్ట్ చేశారు.

ఏలగిరి ఎక్స్‌ప్రెస్ రద్దు

- రెండు ఎక్స్‌ప్రెస్‌ల దారి మళ్ళింపు
- దక్షిణ రైల్వే ప్రకటన

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను కారణంగా ఉత్తర తమిళనాడులో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. విమాన సర్వీసులతో పాటు రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఇండిగో విమాన సర్వీసులన్నీ రద్దు చేశారు. అలాగే, చెన్నై బీచ్ నుంచి వేళచ్చేరి వరకు నడిచే ఎంఆర్‌టీఎస్ రైళ్లు, చెంగల్పట్టు నుంచి తాంబరం మీదుగా చెన్నై బీచ్ వచ్చే రైలు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. అదేవిధంగా చెన్నై సెంట్రల్ నుంచి జోలార్‌పేట వరకు నడిపే ఏలగిరి ఎక్స్‌ప్రెస్‌ను శనివారం పూర్తిగా రద్దు చేశారు. 12511 నెంబరు గోరఖ్‌పూర్ - తిరువనంతపురం (కొచ్చువెలి) రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌ను చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు రానివ్వకుండా కొరుకుపేట స్టేషన్, పెరంబూరు స్టేషన్‌ల మీదుగా దారి మళ్ళించారు. ఈ రైలుకు పెరంబూరు స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక స్టాపింగ్ వెసులుబాటు కల్పించారు. 13351 నంబరు ధన్‌బాద్ - ఆళపుళా ఎక్స్ ప్రెస్ కూడా కొరుకుపేట, పెరంబూరు మీదుగా దారి మళ్ళించి, పెరంబూరులో ఆగి వెళ్ళేలా చర్యలు తీసుకున్నట్టు దక్షిణ రైల్వే విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

సబర్బన్ రైళ్ల రద్దు

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో రైలు పట్టాలపైకి నీరు చేరడంతో మొత్తం సబర్బన్ రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణరైల్వే ప్రకటించింది. మధ్యాహ్నం 12.15 గంటల నుంచి రైళ్లను ఎక్కడికక్కడ నిలిపేసినట్లు పేర్కొంది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఈ రద్దు కొనసాగుతుందని స్పష్టం చేసింది. కాగా రోడ్డు మార్గాల్లో బస్సులు లేకపోవడంతో సబర్బన్ రైళ్ల ద్వారానైనా వెళ్లొచ్చన్న ఆశతో రైల్వే స్టేషన్లకు వచ్చిన ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం పాటుపడదాం: సీఎం స్టాలిన్

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ బాధితులను తోటివారిగ్గా భావించి వారిని ఆదరించి ఎయిడ్స్ రహిత సమాజాన్ని రూపొందించేందుక పాటుపడాలని ముఖ్యమంత్రి స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఎయిడ్స్ నిరోధక దినం సందర్భంగా ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంధ సంస్థలు కలిసి యేళ్ల తరబడి ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యసేవలను అందించటంతో రాష్ట్రంలో ఆ ప్రాణాంతక వ్యాధి వ్యాప్తి తగ్గుముఖం పట్టిందన్నారు. రాష్ట్రంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి రహిత రాష్ట్రంగా రూపుదిద్దుకునేలా ప్రజలంతా ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని స్టాలిన్ ఆ సందేశంలో విజ్ఞప్తి చేశారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించండి

- టీఎంసీ నేత జీకే వాసన్

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ సూచించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... తిరుప్పూర్ జిల్లా పల్లడంలో ముగ్గుర్ని దారుణంగా హతమార్చడం రాష్ట్ర ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. అలాగే, చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలు, లైంగిక వేధింపులు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని, వీటిని అరికట్టేలా ప్రభుత్వం సత్వరం చర్యలు చేపట్టాలని జీకే వాసన్ డిమాండ్ చేశారు.

అంతర్గత కలహాలు కప్పిపుచ్చేందుకే ప్రభుత్వంపై విమర్శలు

- అన్నాడీఎంకేపై ఆర్ఎస్ భారతి ధ్వజం

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కుమ్ములాటలను కప్పిపుచ్చుకొనేందుకే అన్నాడీఎంకే నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీతో కూటమి పెట్టుకోవాలో తేల్చుకోలేని ఎడప్పాడి, పార్టీలో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలు కూడా నియంత్రించలేకపోతున్నారన్నారు. తిరుప్పూర్ జిల్లాలో ముగ్గురి హత్యపై సత్వరం స్పందించిన ముఖ్యమంత్రి, నిందితులను పట్టుకొనేందుకు ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారన్నారు.మదురై జిల్లాలో టంగ్‌స్టన్ మైనింగ్ కాంట్రాక్ట్ రద్దు చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రధానికి లేఖ రాశారని ఆర్ఎస్ భారతి గుర్తుచేశారు.

20కి కొడనాడు కేసు విచారణ వాయిదా

వేళచ్చేరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొడనాడు కేసు విచారణ ఈ నెల 20వ తేదీకి వాయిదాపడింది. నీలగిరి జిల్లా కోతగిరి సమీపంలోని కొడనాడు ఎస్టేట్‌లో 2017 ఏప్రిల్ 23వ తేది వాచ్‌మేన్ ఓంబహదూర్ హత్యకు గురయ్యాడు. అలాగే, ఎస్టేట్ భవనంలోని వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి సయాన్, వాలయారు మనోజ్, సంతోష్ సామి, దీపు, సదీశన్ సహా పదిమందిని కోతగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణలో ఊటీ కోర్టులో జరుగుతున్న నేపథ్యంలో, కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ చేశారు. కోవై అడిషినల్ డిప్యూటీ కమిషనర్ మురుగవేల్ నేతృత్వంలో విచారణ జరుగుతోంది. ఈ కేసు శుక్రవారం విచారణకు రాగా హత్య, దోపిడీ జరిగిన కొడనాడు బంగ్లాను పరిశీలించేందుకు అనుమతించాలని పిటిషన్ వేశామని, ఇంతవరకు అనుమతించలేదని ముద్దాయిల తరపు న్యాయవాది విజయన్ పేర్కొన్నారు. కొడనాడు బంగ్లా పరిశీలనకు అనుమతించమని ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. ఇరు వాదనల అనంతరం న్యాయమూర్తి మురళీధరన్, తదుపరి విచారణ ఈ నెల 20వ తేదీకి వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఓఎంఆర్‌లో వాహనాల నిలిపివేత

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను మహాబలిపురం - కారైక్కాల్ ప్రాంతాల మధ్య తీరం దాటుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పాత మహాబలిపురం రోడ్డు (ఓఎంఆర్)లో వాహనాల రాకపోకలను శనివారం మధ్యాహ్నం నుంచి నిలిపివేశారు. తుఫాను తీరం దాటే సమయంలో ఈదురు గాలులతో అతి భారీ వర్షం కురుస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే, ఈ రహదారి ప్రాంతంలో నివశించే ప్రజలు కూడా అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా, పార్కులు, సముద్రతీర ప్రాంతాల వంటి బహిరంగ ప్రాంతాలకు వెళ్ళవద్దని అధికారులు కోరారు.

పోలీసుల పేరిట రూ.3 లక్షల దోపిడీ

- ఐదుగురి అరెస్ట్

వేళచ్చేరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదురైలో పోలీసులమని చెప్పి రూ.3 లక్షలు దోచుకున్న వ్యవహారంలో ఐదుగురి ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నామక్కల్ జిల్లా రాశిపురం కరట్టుకోట ప్రాంతానికి చెందిన శివసుబ్రమణికి మదురై సోకికుళంకు చెందిన ముత్తుకుమార్ పరిచయమయ్యాడు. డబ్బును రెట్టింపు చేసి ఇస్తానని చెప్పాడు. ఈ మాటలు నమ్మిన శివసుబ్రమణి రూ.3 లక్షలు తీసుకొని మదురై వచ్చారు. శివసుబ్రమణిని కారులో తీసుకెళ్లిన ముత్తుకుమార్, మదురై కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్ వద్ద కారు ఆపి, అక్కడున్న వారిని చిరునామా అడుగుతున్నాడు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు, తాము పోలీసులమని చెప్పి కారులో తనిఖీ చేశారు. వారికి భయపడుతున్నట్లు నటించిన ముత్తుకుమార్, రూ.3 లక్షలు తీసుకొని మరో ద్విచక్రవాహనంలో పరారయ్యాడు. తాను మోసపోయానని గ్రహించిన శివసుబ్రమణి తల్లాంకుళం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు, ముత్తుకుమార్ సహా అతని అనుచరులు మురుగపాండి, బాలసుబ్రమణియన్, అళగేశన్ సహా ఐదుగురిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

ప్రేమ పేరుతో మోసం.. ప్రియుడి అరెస్టు

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ యువతిని గర్భవతిని చేసిన ప్రియుడిని కోయంబత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ జిల్లాలో 26 యేళ్ళ అవివాహిత ఉప్పిలిపాళెయంలోని ఒక వాణిజ్య కేంద్రంలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నారు. ఈ యువతికి పుల్లుకాటు ప్రాంతానికి చెందిన వ్యక్తి(27) ప్రేమ పేరుతో లోబరుచుకున్నాడు. ఈ క్రమంలో ఆ యువతి గర్భందాల్చింది. ఈ విషయాన్ని ప్రియుడుకి చెప్పగా గర్భస్రావం చేసుకోవాలంటూ సలహా ఇవ్వడంతో ఆమె కూడా అదేవిధంగా చేసింది. అయితే, ఆ తర్వాత కూడా ఆమెను పెళ్ళి చేసుకునేందుకు జయప్రకాష్ మొండికేస్తూ వచ్చాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి జయప్రకాష్‌ను అరెస్టు చేశారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మాధవరంలో నగల దోపిడీ

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం శ్రీనివాసన్ నగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న షాజహాన్ రెట్టేరి ప్రాంతంలో రంగుల చేపల విక్రయాలు చేపడుతున్నాడు. ఆయన ఇంట్లో ఏడుగురు బంధువులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో, స్నేహితుడి కొత్త ఇంటి గృహప్రవేశానికి గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి బంధువులతో పాటు షాజహాన్ వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం ఇంటికి రాగా, వెనుకవైపున్న గ్రిల్స్ తొలగించి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా, బీరువాలో ఉంచిన 100 సవర్ల నగలు అదృశ్యం కావడం గుర్తించి దిగ్భ్రాంతి చెందాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన కొళత్తూర్ పోలీసులు, ఆ ప్రాంతంలో ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

నీటమునిగి మూడో తరగతి విద్యార్థి మృతి



మృతుడు ధనుష్ (ఫైల్ ఫొటో)

వేళచ్చేరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సరదాగా చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన మూడో తరగతి విద్యార్థి నీటమునిగి మృతిచెందిన ఘటన తిరువణ్ణామలై జిల్లాలో చోటుచేసుకుంది. కలశపాక్కం సమీపం సిరువళ్లూర్ గ్రామానికి చెందిన రైతు ఏలుమలై-రేణుకాంబాళ్ దంపతులకు నితీష్ (9), ధనుష్ (7) అనే కుమారులున్నారు. రెండో కుమారుడు ధనుష్ అదే ప్రాంతంలోని పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికొచ్చిన ధనుష్, ఆడుకుంటానని తల్లిదండ్రులకు చెప్పి బయటకు వెళ్లాడు. కానీ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు అతడి కోసం చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో, శుక్రవారం ఉదయం కడలాడి పోలీసులకు వారు ఫిర్యాదుచేశారు. పోలీసులు ఆ ప్రాంతంలోని చెరువు వద్ద గాలించగా, ధనుష్ బట్టలు కనిపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని చెరువులో గాలించి, అడుగున బురదలో చిక్కుకొని మృతిచెందిన ధనుష్ మృతదేహం వెలికితీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పలు రైళ్ల గడువు పొడిగింపు

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్ల గడువును ప్రయాణీకుల విజ్ఞప్తి మేరకు పొడిగిస్తున్నట్లు దక్షిణరైల్వే ప్రకటించింది. నిజానికి ఆయా రైళ్లు డిసెంబరు 5వ తేదీ వరకు మాత్రమే నడవాల్సివున్నా.. ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా మరికొంతకాలం పొడిగిస్తున్నట్లు దక్షిణ రైల్వే వెల్లడించింది. ఆయా రైళ్లకు రిజర్వేషన్ కూడా ప్రారంభమైంది. గడువు పొడిగిస్తున్న రైళ్ల వివరాలిలా వున్నాయి...

రైలు	నెంబరు	బయలుదేరే రోజు	పొడిగింపబడిన తేదీ
నాగర్‌కోయిల్ - తాంబరం వీక్లీ ఎక్స్‌ప్రెస్	(06012)	ఆదివారం	02.02.2025
తాంబరం - నాగర్‌కోయిల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్	(06011)	సోమవారం	03.02.2025
తిరునల్వేలి - ఎగ్మూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్	(06070)	గురువారం	06.02.2025
ఎగ్మూర్ - తిరునల్వేలి వీక్లీ ఎక్స్‌ప్రెస్	(06069)	శుక్రవారం	07.02.2025
తాంబరం - రామనాథపురం బైవీక్లీ ఎక్స్‌ప్రెస్	(06103)	గురు, శనివారం	28.12.2024
రామనాథపురం - తాంబరం బైవీక్లీ ఎక్స్‌ప్రెస్	(06104)	శుక్ర, ఆదివారం	29.12.2025
తాంబరం - కోయంబత్తూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్	(06184)	శుక్రవారం	07.02.2025
కోయంబత్తూర్ - తాంబరం వీక్లీ ఎక్స్‌ప్రెస్	(06185)	ఆదివారం	09.02.2025
తిరునల్వేలి - మేట్టుపాళయం వీక్లీ ఎక్స్‌ప్రెస్	(06030)	ఆదివారం	02.02.2025
మేట్టుపాళయం - తిరునల్వేలి వీక్లీ ఎక్స్‌ప్రెస్	(06029)	సోమవారం	03.02.2025

మెరీనాలో పోలీసు బూత్ ధ్వంసం

- ఎగిరిపడ్డ బారికేడ్లు

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాబీచ్ వద్ద శనివారం సాయంత్రం పెనుగాలులకు లైట్‌హౌస్ వెనుక లూప్ రోడ్డు కూడలి వద్ద పోలీస్ బూత్ ధ్వంసమైంది. అదే సమయంలో ఆ ప్రాంతం వద్ద బీచ్‌లో ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు ఉంచిన బారికేడ్లు పెనుగాలల కారణంగా ఎగిరి పది అడుగుల దూరంలో పడ్డాయి. అది చూసి పోలీసులు, స్థానికులు ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత పట్టినంబాక్కం వైపు లూప్ రోడ్డును పోలీసులు మూసివేశారు.

సైదాపేట మెట్రో పార్కింగ్‌లోకి వరదనీరు

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేట మెట్రో రైల్వే స్టేషన్ పార్కింగ్ స్థలంలోకి భారీగా వరద నీరు చేరింది. ఇక్కడ నడుంలోతు నీరు చేరడంతో వాహనాలను తక్షణం ఖాళీ చేయాలని ఆ స్టేషన్ అధికారులు ఆదేశించారు. అయితే అప్పటికే అక్కడ వాహనాలు పార్క్ చేసివుండడంతో.. వాటి యజమానులకు సమాచారం ఇవ్వలేక పలు వాహనాలను అక్కడికి వేరే ప్రాంతానికి తరలించినట్లు సమాచారం.

నగర వాసుల సాయం కోసం అన్నాడీఎంకే కమిటీ

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా నగర వాసులకు సాయం చేసేందుకు అన్నాడీఎంకే తరపున ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షానికి నగరంలోని అన్ని రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని, నగర వాసులకు తమ పార్టీ తరపున సాయం చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు పక్కన నిలిపిన పడవలు



తీరానికి దూరంగా ఉంచిన ఫైబర్, నాటు పడవలు

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా నాగపట్టణం జిల్లాల్లో సముద్రం అలలు పదడుగుల మేర ఎగసిపడుతున్నాయి. అలల తాకిడి అధికంగా ఉన్న నేపథ్యంలో, పడవలు రక్షించుకొనేందుకు జాలర్లు తంటాలు పడుతున్నారు. పుదుపేట జాలర్లు తీరంలో ఉంచిన తమ ఫైబర్, నాటు పడవలను ట్రాక్టర్ల ద్వారా వంద మీటర్ల దూరం తీసుకెళ్లి రోడ్డు పక్కన సురక్షిత ప్రదేశంలో ఉంచారు.

80 అడుగుల మేరకు వెనక్కి తగ్గిన సముద్రం

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చెందూరులో సముద్రపు అలలు ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాయి. అలాగే, ఇక్కడి సముద్ర తీరం ఒక్కసారిగా 80 అడుగుల మేరకు వెనక్కితగ్గింది. సాధారణంగా పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ఆటుపోట్ల కారణంగా ఈ తరహా దృశ్యాలను స్థానికులు చూస్తుంటారు. కానీ, గత రెండు రోజులుగా ఇక్కడ సముద్రం వెనక్కి వెళ్ళింది. శనివారానికి ఇది దాదాపు 80 అడుగుల మేరకు వెనక్కి వెళ్ళింది.

పాములు పట్టేందుకు హెల్ప్ నెంబర్

అడయార్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాములు, తేళ్ళు, జెర్రిలు వంటి విషపు పురుగులు నివాసాల్లోకి వస్తున్నాయి. ముఖ్యంగా చెన్నై సహా శివారు ప్రాంతాల్లో పాములు వస్తే వాటిని పట్టుకునేందుకు స్నేక్ క్యాచర్స్‌ను సిద్ధంగా ఉంచారు. వీరి సాయం కావాలనుకునేవారు 044 2220 0335 లేదా 181 అనే హెల్ప్ నంబర్లలో సంప్రదించాలని ప్రభుత్వం తెలిపింది.

పుదుచ్చేరిలో పర్యాటక ప్రాంతాల మూత

పుదుచ్చేరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో భారీ వర్షాల కారణంగా పర్యాటక ప్రాంతాలను మూసివేశారు. ఆ ప్రాంతాల్లో పోలీసులు కాపలా కాస్తూ పర్యాటకులను పంపించేస్తున్నారు. ఫెంగల్ తుఫాను ప్రభావంతో పుదుచ్చేరిలో శుక్రవారం అర్ధరాత్రి నుండి శనివారం వేకువజాము వరకు భారీ వర్షాలు కురిశాయి. వర్షాలకు తోడు గాలులు బలంగా వీస్తుండటంతో పుదుచ్చేరిలోని బీచ్ రోడ్డు, పాండీ మెరీనా, చిన్న వీరాంపట్టినం బీచ్, నల్లవాడు, మూర్తికుప్పం తదితర సముద్రతీర గ్రామాల్లో ఉన్న పర్యాటక స్థలాలను మూసివేశారు.

12 మంది రామేశ్వరం జాలర్ల విడుదల

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్లలో ఉన్న 12 మంది జాలర్లను ఆ దేశ న్యాయస్థానం విడుదల చేసింది. రామేశ్వరానికి చెందిన 16 మంది జాలర్లు కొద్దిరోజుల క్రితం చేపల వేటకు వెళ్లిన సమయంలో శ్రీలంక నావికాదళం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించింది. అలాగే, జాలర్లు వినియోగించిన రెండు పడవలను కూడా స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో 12 మంది జాలర్లను విడుదల చేసిన ఆ దేశ న్యాయస్థానం, రెండో సారి సరిహద్దులు దాటి పట్టుబడ్డారంటూ నలుగురు జాలర్లకు జైలుశిక్ష విధించింది. జైళ్ల నుంచి విడుదలైన జాలర్లు విమానంలో శుక్రవారం చెన్నై విమానాశ్రయానికి చేరుకున్నారు. వారిని మత్స్యశాఖ అధికారులు, వాహనాల్లో వారి వారి స్వగ్రామాలకు పంపించారు.


ఆగిన రెవెన్యూ అధికారుల సమ్మె

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ అధికారులు చేపట్టిన సమ్మె తాత్కాలికంగా విరమించుకున్నారు. ఈ విషయమై రెవెన్యూ శాఖ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మురుగైయన్, శంకరలింగం విడుదల చేసిన ప్రకటనలో... పల సమస్యల సాధనకు గత మూడు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేపట్టామన్నారు. ఈ విషయమై మంత్రులు సాత్తూర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, రెవెన్యూ శాఖ కార్యదర్శి అముద, రెవెన్యూ కమిషన్ రాజేష్ లఖానీ తదితరులతో సంఘం ప్రతినిధులు జరిపిన చర్చల్లో, సమస్యలను నెలలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, దాంతో సమ్మెను తాత్కాలికంగా విరమించినట్టు వారు ప్రకటించారు.

బస్సుల్లో ఉచిత ప్రయాణానికి పోలీసులకు 'స్మార్ట్ కార్డ్'

పెరంబూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సుల్లో పోలీసుల నుంచి ఇన్‌స్పెక్టర్ల వరకు ఉచితంగా ప్రయాణించేందుకు 'స్మార్ట్ కార్డ్' ఇవ్వనున్నట్లు డీజీపీ శంకర్ జివాల్ తెలిపారు. 2021 అసెంబ్లీ సమావేశాల్లో పోలీసు శాఖ పద్దు పెట్టే సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్, పోలీసుల నుంచి ఇన్‌స్పెక్టర్ల వరకు తాము పనిచేస్తున్న జిల్లా పరిధిలో ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రకటించారు. దానికి సంబంధించిన జీవో గత ఆగస్టులో ప్రభుత్వం విడుదల చేసిన నేపథ్యంలో, పోలీసులు, ఇన్‌స్పెక్టర్లు ఉచిత ప్రయాణానికి సంబంధించి 'స్మార్ట్ కార్డ్‌లు అందించేలా ఆయా జిల్లాల ఎస్పీలు చర్యలు చేపట్టి, డిసెంబరు 16వ తేదిలోపు నివేదిక అందజేయాలని డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

వేలూరులో తుఫాను సహాయక చర్యల్లో అధికారులు



వీరతాంగల్ చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'ఫెంగల్' తుఫాను సహాయక చర్యల్లో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. కాట్పాడి డివిజన్ పొన్నై ఆనైకట్టు ప్రధాన కాలువను నగర ప్రాంత జీవనాధార అభివృద్ధి అధికారి డా.విజయ్‌కార్తికేయన్ పరిశీలించారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, 1077 అనే నెంబరు పరిచయం చేశారు. జిల్లాలో తుఫాను సహాయక చర్యలను కలెక్టర్ సుబ్బులక్ష్మి, రెవెన్యూ తహసీల్దార్ బాలసుబ్రమణ్యం, నీరుపారుదల శాఖ ఏఈ గోపి, తహసీల్దార్ జగదీశ్వరన్, బీడీఓ నందకుమార్ సహా పలువురు పర్యవేక్షించారు. అలాగే, ఆనైకట్టు డివిజన్‌లో వీరతాంగల్, బెండుతాంగల్ చెరువులను కలెక్టర్ పరిశీలించారు.



వేళచ్చేరి ఫ్లై ఓవర్‌పై నిలిపిన కార్లు



బీసెంట్‌నగర్‌లో కూలిన వృక్షం





ఈసీఆర్‌లో ఈదురుగాలులతో భారీవర్షం

తుఫాన్ బీభత్సం...

పలు ప్రాంతాలు జలమయం



పార్కింగ్ స్థలంలోనే చేరిన నీరు



బ్రాడ్‌వే సమయంలోని హైకోర్టు చుట్టుపక్కల రోడ్లపై వరద నీరు



టి.నగర్ సబ్‌వేలో నిలిచిన నీరు



వర్షపు నీటిలో ప్రయాణికుల ఇక్కట్లు

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను నగరాన్ని ముంచెత్తింది. తుఫాను కారణంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో చెన్నై జలదిగ్బంధంలో చిక్కుకుంది. శనివారం మొత్తం వర్షం కురుస్తూనే వుండడంతో వాణిజ్య కేంద్రాలుండే టీనగర్, పురుషవాక్కం, ప్యారీస్ వంటి ప్రాంతాలు సైతం నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఈ వర్షబీభత్సం కారణంగా వాహనాల రాకపోకలు తగ్గిపోయాయి. సిటీ బస్సులు కూడా స్వల్పంగా తిరిగాయి. తిరునిండ్రవూరు - తిరవళ్లూరు జాతీయ రహదారిలో రోడ్డు డివైడర్ ఎత్తు దాకా వర్షపునీరు వరదలా ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పట్టాభిరాం మెయిన్‌రోడ్డు, తెండ్రల్ నగర్, ఆవడి వసంతం నగర్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ క్వార్టర్స్ ప్రాంతం, సరస్వతినగర్, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాలు వాననీటిలో మునిగాయి. మనలి ఎక్స్‌ప్రెస్‌రోడ్డులో వరదలా వర్షపునీరు ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఎంజీఆర్ నగర్‌లో నడుములోతున వర్షపునీరు బురదనీటితో కలిసి జోరుగా ప్రవహిస్తోంది. కార్గిల్ నగర్, రాజాజీ నగర్, సత్యమూర్తినగర్ తదితర ప్రాంతాల్లోని రెసిడెన్షియల్ క్వార్టర్స్ జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడుతున్నాయి.



మందవెల్లిలోని ఓ ఇంట్లో చేరిన నీరు



రోడ్డుపై నీరు చేరడంతో ఆగిన బస్సు



రెట్టేరిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో చేరిన నీరు



సముద్ర తీరాన వున్న పడవల్లి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం



పల్లావరం ప్రభుత్వాసుపత్రిలో చేరిన వరదనీరు





టి.నగర్‌లోని రోడ్లపై నిలిచిన వర్షపునీరు



అల్లకల్లోలంగా సముద్రం



జలమయమైన ఎంకేబీ నగర్ రోడ్డు

భార్యాభర్తలు మొబైల్ ఫోన్లు మార్చుకుంటే...

వివేక్ - సాక్షి జంటగా 'రింగ్ రింగ్'

హైటెక్ ప్రపంచంలో మొబైల్ ఫోను లేకుండా జీవితం గడపలేని స్థితిలో ప్రజలు ఉన్నారు. అదే ఫోన్ నేపథ్యంలో 'రింగ్ రింగ్' పేరుతో ఒక చిత్రం రూపొందుతోంది. వివేక్ ప్రసన్న, సాక్షి అగర్వాల్ జంటగా నటించే ఈ చిత్రానికి శక్తివేల్ దర్శకుడు. గతంలో 'గంధకోట్టై', 'ఈగో', '4 సారీ' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. దియా శ్రీ క్రియేషన్స్, రూల్ బ్రేకర్స్ ప్రొడక్షన్ పతాకాలపై జగన్ నారాయణన్, శక్తివేల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'పెళ్ళికి ముందు ఒకరి ఫోన్లు ఒకరు మార్చుకుంటే 'లవ్‌టుడే' సినిమా. వివాహం తర్వాత భార్యాభర్తలు మార్పిడి చేసుకుంటే అది 'రింగ్ రింగ్' మూవీ. పెళ్ళయిన తర్వాత నాలుగు జంటలు తమ ఫోన్లు మార్చుకుంటారు. ఆ తర్వాత వారి జీవితాల్లో జరిగే ఫన్నీ, ఇంట్రెస్టింగ్, మిస్టీరియస్, ఎగ్జైట్‌మెంట్ సంఘటనలతో ఈ సినిమాను రూపొందించాం. ఈ నాలుగు జంటల నేపథ్యాలు వేర్వేరుగా ఉంటాయి. ఇతర పాత్రల్లో డేనియల్ అన్నీ పోప్, ప్రవీణ్, అర్జునన్, స్వయం, సహానా, జమున నటించారు. షూటింగ్ మొత్తం చెన్నై, ఈసీఆర్‌లో చిత్రీకరించాం. ఫస్ట్‌లుక్‌ను విజయ్ సేతుపతి రిలీజ్ చేయగా, వచ్చే యేడాది జనవరి 3వ తేదీ విడుదల చేసేలా ప్లాన్ చేశాం' అని వివరించారు.



'రింగ్ రింగ్'లో వివేక్ ప్రసన్న - సాక్షి అగర్వాల్

చైనాలో 'మహారాజ' రిలీజ్

● ఎస్కే విషెస్




నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా నటించిన 'మహారాజ' చిత్రం ఘన విజయం సాధించి, రూ.100 కోట్ల మేరకు వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం ఇపుడు చైనాలో విడుదలైంది. దీన్ని పురస్కరించుకుని 'అమరన్' హీరో శివకార్తికేయన్ (ఎస్కే) ఆ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'చైనాలో 'మహారాజ' చిత్రం భారీ స్థాయిలో రిలీజ్ చేశారు. ఇది ఎంతో గర్వంగా ఉంది. అక్కడ కూడా భారీ విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. విజయ్ సేతుపతి, నితిలన్ స్వామినాథన్, మొత్తం యూనిట్ సభ్యులు దేశ సరిహద్దులను దాటి సక్సెస్ సాధించాలని ఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు. కాగా, 'మహారాజ'కు చైనా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుంది కూడా. దీంతో తొలి రోజునే రిజర్వేషన్ల రూపంలో రూ.5.5 కోట్లకుపైగా వసూలు చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చిత్రాన్ని ప్యాషన్ స్టూడియోస్, థింక్ స్టూడియోస్, ది రూట్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. విజయ్ సేతుపతి, అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నటరాజన్ సుబ్రమణియం నటించారు.

చిత్రజ్యోతి

విపరీతమైన దైవభక్తి

● రాశీఖన్నా



తనకు విపరీతమైన దైవభక్తి అని ప్రముఖ హీరోయిన్ రాశీఖన్నా అన్నారు. 'ఇమైకా నొడిగల్, 'సర్దార్', 'అరణ్మనై-4' వంటి హిట్ చిత్రాల్లో నటించిన రాశీఖన్నా. ఇటు తమిళం, తెలుగు, హిందీ భాషా చిత్రాల్లో నటిస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. బాలీవుడ్‌లో 'సబర్మతి రిపోర్ట్' చిత్రంలో ముఖ్య పాత్ర పోషించారు. నవంబరు 30న తన పుట్టిన రోజు సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'నేను నటించిన ప్రతి భాషా చిత్రాన్ని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ముఖ్యంగా 'సబర్మతి రిపోర్ట్' మూవీలో నా నటనకు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఇది నాలో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. నా పుట్టిన రోజు సందర్భంగా గత నాలుగేళ్ళుగా మొక్కలను నాటుతున్నాను. ఈ పుట్టిన రోజు కూడా వారణాసిలో మొక్కలు నాటాను. నాలో లోతైన భక్తి భావాలున్నాయి. దేవుడిని ప్రార్థించడం ఎంతో ఇష్టం. గత పదేళ్ళుగా దైవభక్తిలో మునిగిపోయాను' అని పేర్కొన్నారు.

పోలీసు పెట్రోలింగ్‌కు ఎలక్ట్రికల్ కార్లు



వాహనాలు ప్రారంభిస్తున్న కోవై పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్

ప్యారీస్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ నగర పోలీసు శాఖ పెట్రోలింగ్ కోసం నాలుగు ఎలక్ట్రికల్ కార్లు వినియోగించనుంది. కోవై నగర పోలీసు శాఖకు జోస్ ఆలూకాస్ జువెలరీ సామాజిక బాధ్యత పథకం కింద రూ.60 లక్షలతో నాలుగు ఎలక్ట్రిక్ కార్లు కొనుగోలు చేసింది. ఈ కార్లను కోవై నగర పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్ శుక్రవారం ప్రారంభించారు.



నాలుగు రోజుల పర్యటన నిమిత్తం నీలగిరి జిల్లా ఊటీ వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం అక్కడి రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్‌ఎన్ రవి దంపతులతో కలిసి మోగ్నోలియా మొక్కలను నాటుతున్న దృశ్యం



శనివారం చెన్నై ఫ్లవర్ బజార్ సమీపంలో వున్న మెట్రోవాటర్ పంపింగ్ స్టేషన్ వద్దకెళ్లి తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్. మంత్రులు పీకే శేఖర్‌బాబు, కేఎన్ నెహ్రూ, చెన్నై మేయర్ ఆర్.ప్రియ తదితరులు

క్రిస్మస్ వేడుకల్లో శృతిహాసన్



చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మార్కెట్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన క్రిస్మస్ ట్రీ లైటింగ్ వేడుకల్లో సినీ నటి శృతి హాసన్ పాల్గొన్నారు. ప్రేమ, ఆకాంక్ష, ఐక్యతకు చిహ్నంగా నిలిచిన అద్భుతంగా అలంకరించబడిన క్రిస్మస్ చెట్టును ఆమె ఈ సందర్భంగా ఆవిష్కరించారు. శృతిహాసన్‌ను చూసిన ఆమె అభిమానుల అరుపులు, కేకలతో ఆ ప్రాంతం మార్మోగింది.



నందికి జలపాతాభిషేకం

పులకించిన నగరం

కొండకోనల్లో కురిసిన చినుకులు పాయలై పారి.. వాగులై ఉరికి.. జలపాతాలై దూకాయి. రాత్రి నుంచీ కురుస్తున్న వానలో తడిచి, తలకిబోసుకున్న ప్రకృతి కన్యలా తిరుమల కొండలు కళకళలాడుతున్నాయి. మాలాడగుండం, కపిలతీర్థం జలపాతాలు తిరుమల భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. కొండ సిగలో మెరుస్తున్న ఈ తెల్ల జలవంకలను చూస్తూ నగరవాసులు మురిసిపోతున్నారు. వాన పెంచిన చలికి జనం మరింత ముడుక్కుని గడుపుతున్నారు. చిన్నాచితకా వ్యాపారాలన్నీ గొడుగుల కిందకు చేరుకున్నాయి. శనివారం నాటి వాన దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు అందిస్తున్నారు.



గోపురానికి నమస్కరిస్తున్న కపిలతీర్థం



గొడుగుల కింద తలదాచుకున్న కూరగాయల మార్కెట్




వాహనసేవలో కళా నీరాజనం

ముత్యపు పందిరి వాహనసేవలో వివిధ రాష్ట్రాలకు చెందిన 12 కళా బృందాలలోని 272 మంది కళాకారులు అమ్మవారికి కళా నీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన కళాకారులు కథక్, భరతనాట్యం, కూచిపూడి కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కంజీర కోలాటం, పిల్లనగ్రోవి వంటి జానపద నృత్యాలను ప్రదర్శించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లుల మధ్య తిరుపతి ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలకు చెందిన విద్యార్థులు పౌరాణిక పాత్రలను పోషించి భక్తులను అలరించారు.

ముత్యపు పందిరిపై పద్మావతమ్మ

రాలిన చినుకు.. నత్త గర్భంలో ముత్యంగా మారుతుంది. కురుస్తున్న చినుకుల్లో ఆ ముత్యాల వాహనంలోనే పద్మావతీ దేవి తిరుచానూరు మాడవీధుల్లో ఊరేగారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం ముత్యపు పందిరిపై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వర్షంతో పటాటోపం కిందనే ఊరేగింపు సాగింది. మేళతాళాలు, భజన, కళాబృందాలు తడుస్తూనే ప్రదర్శనలు ఇచ్చారు. పండితులు గొడుగుల కిందకు చేరి వేదపారాయణం సాగించారు. కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

– తిరుచానూరు, ఆంధ్రజ్యోతి





శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.3.77 కోట్లు ఆదాయం లభించినట్టు శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 62,147 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 23,096 మంది తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌కు రూ.10 లక్షల విరాళం

తిరుపతి(వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదరాబాదుకు చెందిన ఇడిముక్కల హాసిని రూ.10 లక్షల విరాళం అందజేశారు. స్విమ్స్‌లో శనివారం డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను కలిసి డీడీని అందించారు. హాసిని మాట్లాడుతూ తన తాత ఇడిముక్కల యతిరాజయ్య జ్ఞాపకార్థం ఈ నగదును అందిస్తున్నట్లు తెలిపారు. హాసిని కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు, స్రవంతి, రాజేష్ బాబు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనేశ్వర్-తిరుపతి మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అలాగే బెంగళూరు-భువనేశ్వర్, పూరీ-యశ్వంతపూర్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

యువకుడి దారుణహత్య

ఉసురు తీసిన వివాహేతర సంబంధం



శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కారణంగా యువకుడు హత్యకు గురయ్యాడు. శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు పంచాయతీ ఓటుగుంట సెంటర్‌కు చెందిన రవి(20) భవన నిర్మాణ కార్మికుడు. ఇదే సెంటర్‌కు చెందిన ఆర్ముగం అతనికి సమీప బంధువు. కొంతకాలంగా ఆర్ముగం కుటుంబసభ్యురాలితో రవి వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. దీనిపై ఆగ్రహించిన ఆర్ముగం శనివారం రాత్రి రవి ఇంటి వద్దకు కత్తితో వెళ్లాడు. మాటా మాటా పెరగడంతో రవిపై కత్తితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవి నాయక్, ఏఎస్ఐ మధు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆర్ముగంను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

అలిపిరిలో తనిఖీల వైఫల్యం

- **అన్యమత వ్యాఖ్యలతో తిరుమలకు వచ్చిన కారు**



తిరుమల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): అలిపిరిలో భద్రతా తనిఖీల వైఫల్యం మరోసారి వెలుగుచూసింది. అన్యమతనానికి చెందిన వ్యాఖలతో కూడిన ఓ కారు తిరుమలకు రావడం విమర్శలకు దారితీసింది. సాధారణంగా రాజకీయ, ఇతర మతాలకు చెందిన ఫొటోలు, గుర్తులు, నినాదాలతో వాహనాలు తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి చెక్‌పాయింట్ తనిఖీల్లోనే భద్రతా సిబ్బంది అడ్డుకోవాలి. అయితే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇతర మతానికి చెందిన వ్యాఖ్యలతో కూడిన కారు నేరుగా తిరుమలకు చేరుకుంది. ఆ కారును ఆలయానికి సమీపంలోని అర్చక నిలయం వద్ద పార్కింగ్‌లో ఉంచడం చర్చనీయాంశమైంది.

3న స్థానికులకు శ్రీవారి దర్శనం

- **రేపు తిరుపతి, తిరుమలలో టోకెన్ల జారీ**

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి అర్బన్, రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన భక్తులకు టీటీడీ శుభవార్త తెలిపింది. డిసెంబరు 3న శ్రీవారి దర్శనాన్ని కల్పించనున్నట్టు టీటీడీ ప్రకటించింది. గతంలో ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకున్న దర్శనాన్ని టీటీడీ రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనిని పునరుద్ధరించాలని నవంబరు 18న టీటీడీ బోర్డు నిర్ణయించింది. గతంలో తిరుమల, తిరుపతి అర్బన్, రూరల్‌కే పరిమితం చేయగా.. ఈసారి రేణిగుంట, చంద్రగిరి మండలాలనూ కలిపారు. డిసెంబరు 3న స్థానికులకు దర్శనం కోసం.. 2వ తేదీ ఉదయం 5 గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియం, తిరుమలలోని బాలాజీనగర్‌లో కమ్యూనిటీ హాల్‌లో టోకెన్లను జారీ చేయనున్నారు. ఒరిజనల్ ఆధార్‌కార్డు చూపించి టోకెన్లు పొందాలి. ఆదివారం టోకెన్లు జారీ చేయాలని నిర్ణయించినప్పటికీ వర్షాల నేపథ్యంలో సోమవారానికి మార్చారు.



రేణిగుంట మండలం గాజులమండ్యం- కల్లూరు గ్రామాల మధ్య వాగు ఉధృతితో మూసేసిన రోడ్డు

ఒకటే వాన

జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి వానలు విస్తారంగా పడుతున్నాయి. దీంతో వాగులు, వంకల్లో నీటి ప్రవాహం మొదలైంది. పలుచోట్ల రోడ్లపై నీళ్లు చేరాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పలు చోట్ల పొలాల్లోకి నీళ్లు చేరాయి. జనజీవనానికి ఇబ్బందగా మారింది. చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు.

– ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్ వర్క్



దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం వద్ద వెదురుపట్టు రోడ్డులోని వంతెనపై ప్రవహిస్తున్న పాల కాలువ.. పాలకాలువ వరదను పరిశీలిస్తున్న తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్ తదితరులు



నాయుడుపేట లోతువానిగుంట బీసీ బాలుర వసతిగృహం వద్దకు చేరుకున్న వర్షపునీరు



కోట మండలం విద్యానగర్ స్టేట్‌బ్యాంకు వద్ద..



తిరుపతిలో



పుత్తూరు పట్టణ సమీపంలో భవానీనగర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుకాలువ



బీఎన్‌కండ్రిగ మండలం కనమనంబేడులోని చెరువు కట్టపై కూలిన వృక్షం



నారాయణవనం మండలం తిరువట్యం కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎస్ఐ రాజశేఖర్



పునరావాస కేంద్రంలో ఉన్న ఓజిలి మండలం నెమళ్ళపూడి గిరిజనులు



తిరుపతిలో..



ఏర్పేడు మండలం మోదుగులపాళెం వద్ద స్వర్ణముఖి నది లోలెవల్ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వర్షపునీరు